విశాలాంధ్ర
విశాఖపట్నం
శుక్రవారం 10, అక్టోబర్ 2025

ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో విశాఖ ఎంపీ శ్రీభరత్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: న్యూయార్క్‌లో జరుగుతున్న యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ కార్యక్రమంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న భారత ప్రతినిధి బృందంలో భాగమవ్వడం గర్వకారణమని విశాఖ ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన మొదటి రోజున శ్రీభరత్, భారత ప్రతినిధి బృందం న్యూయార్క్‌లో యునైటెడ్ నేషన్స్ హెడ్ క్వార్టర్స్ వద్దనున్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. క్రైసిస్ గ్రూప్ ప్రతినిధి రిచర్డ్ గోవాన్, ఆయన బృందంతో సమావేశమై ఐక్యరాజ్యసమితి కార్యకలాపాలు, ప్రస్తుత అంతర్జాతీయ సవాళ్లు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాంతి, భద్రతా పరిస్థితులపై సమగ్ర చర్చ జరిపారు.

అస్తవ్యస్తంగా రామవరం రహదారి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం రామవరం గ్రామంలో తొమ్మిది నెలలుగా రోడ్డు పరిస్థితి తీవ్ర అస్తవ్యస్తంగా తయారైంది. నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు తరచూ తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే రోడ్డు మధ్యలో ఉన్న గుంత చెరువుల వలె వాహనదారులకు దర్శనం ఇస్తుంది. కానీ నాయకులు గాని అధికారులు గాని ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఊర్లో చిన్న చిన్న పిల్లలు అదే మార్గంలో బడికి వెళ్తుంటారు. ఎక్కడ ఆ గుంతలో పడిపోతారేమో అని పిల్లల తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే 10 గ్రామాల ప్రజలు ప్రతిరోజు అదే మార్గంలో ప్రయాణం చేస్తున్నారు. ఆ గుంత దగ్గర తీవ్ర నరకం చూస్తున్నారు. రాత్రిపూట అయితే మరీ దారుణమైన పరిస్థితి. కానీ ఆ గుంతని పూడ్చే కార్యక్రమం కూడా చేయలేదు. రోడ్డు మధ్యలో ఉన్న గుంత సమస్య పరిష్కారం చేయాలని గ్రామస్తులు పలువురికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పాఠ్య పుస్తకాల్లేవ్....చదివేదెలా...!

నాలుగు నెలలైనా అందని పాఠ్య పుస్తకాలు
భీమిలి పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఉన్నత పాఠశాల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం

విశాలాంధ్ర - భీమిలి: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో ప్రభుత్వం పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు, నాణ్యమైన విద్యను అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. కానీ సాక్షాత్తు నేషనల్ అవార్డు గ్రహీత తిరుమల శ్రీదేవి ప్రధానోపాధ్యాయురాలుగా ఉన్న భీమిలి పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఉన్నత పాఠశాల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా ఇప్పటికీ అచ్చు పుస్తకాలు అందక విద్యార్థులు ఏం చదవాలో, ఎలా చదవాలో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు యూనిఫాం కూడా ఇవ్వకపోవడంతో బాలికలు ఎలిమెంటరీ స్కూల్లో ఇచ్చిన పాత యూనిఫాం వాడుతున్నారు. బాలురు సివిల్ డ్రెస్‌లో స్కూల్‌కి వస్తున్నారు. బూట్లు ఇవ్వారని యూనిఫాం లేకుండా బూట్లు వేసుకుని ఏం ఉపయోగమని విద్యార్థులు అంటున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల శ్రీదేవిని వివరణ కోరగా ఈ విషయంలో సాంకేతిక సమస్య ఉందని, కావలసిన ఇండెంట్ ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టామని వచ్చిన వెంటనే విద్యార్థులకు అందజేస్తామన్నారు. ఎంఈఓ 2 అట్టాడ జయప్రదని వివరణ కోరగా మిగిలిన క్లస్టర్లలో కూడా ఈ సమస్య ఉందని మండలంలో నూతనంగా చేరిన సుమారు 174 మంది విద్యార్థులు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందలేదని ఉన్నతాధికారులకు ఇండెంట్ పెట్టడం జరిగిందని తెలిపారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఈ పాఠశాలలో సుమారు 33 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు పుస్తకాలు ఇవ్వకుండా సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

అడవి మొక్కలో ఔషధగుణాలు మెండు
ఫెరాన్లపై పరిశోధనలో డాక్టరేట్ పొందిన గీతం స్కాలర్

విశాలాంధ్ర - మధురవాడ: అడవి మొక్క (భరణి మొక్క)గా పిలిచే ఫెర్న్ జాతి మొక్కలలో అద్భుతమైన ఔషధ గుణాలు ఉన్నాయని ముఖ్యంగా భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న మధుమేహ వ్యాధి చికిత్సలో ఈ మొక్కలోని విశేష గుణాలు ఉన్నాయని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఔషధ శాస్త్ర పరిశోధకురాలు డాక్టర్ టి.శ్రావణి నిరూపించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ డాక్టర్ పార్థ రాయ్ పర్యవేక్షణలో డా. టి.శ్రావణి జరిపిన పరిశోధనకు గాను గీతం విశ్వ విద్యాలయం డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పి.హెచ్.డి.) డిగ్రీని ప్రకటించింది. "ఫార్మకోగ్నొస్టిక్ స్టడీస్, ఐసోలేషన్ ఆఫ్ ఫైటో-కాన్స్టిట్యూయెంట్స్, అండ్ బయాలాజికల్ ఇవాల్యుయేషన్ ఆన్ ఏరియల్ పార్ట్స్ ఆఫ్ ది ఫెరన్స్" అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం డా. టి.శ్రావణి హైదరాబాద్‌లోని బొటానిక్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో టెక్నికల్ విభాగం మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

సేవలతోనే గుర్తింపు

విశాలాంధ్ర - గాజువాక: సేవలతోనే గుర్తింపు లభిస్తుందని స్టీల్‌ప్లాంట్ ఎం.ఎం.ఎస్.ఎం విభాగాధిపతి పి.ఫణిగోపాల్ పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన ఎం.వెంకటేశ్వరరావు, బుంగ రాజు, యు.నాగరాజు, రెడ్డి శ్రీనివాసరావు ఆత్మీయ సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఫణి గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు ఉక్కు ప్రగతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. తోటి ఉద్యోగులతో మమేకమై అందరి మన్ననలు పొందారని అన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను శాలువాతో ఘనంగా సత్కరించారు. జక్కుల శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫినిషింగ్ ఇన్‌చార్జిలు ఎం.అప్పల నాయుడు, కె.సత్యనారాయణ, ఎం.భాస్కర్‌రావు, సీనియర్ కార్మిక నాయకులు కె.బి.ఆర్ అంబేద్కర్, నీరు కొండ రామచంద్రరావు, ఎల్.వి.రమణారావు, వై.వి.సుబ్బారావు, వంగవండు సింహాచలం, ఎ.శంకర్‌రావు, వి.వి.ఎస్.ఎన్.రాజు, ఎం.వెంకటేశ్వర్లు, బి.వి.ఎస్. వి.ప్రసాద్, ఎస్.సాంబ, ఎ.శ్రీను, ఈ.సన్యాసినాయుడు, బి.వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్ పర్యటనకు తరలివెళ్లిన వైసీపీ శ్రేణులు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎంతో ఉత్సాహంగా చలో నర్సీపట్నం కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం రాకతో పద్మనాభం మండలం వైసీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. వైసిపి మండల అధ్యక్షుడు కోరడ లక్ష్మణరావు, ఎంపీపీ కే.రాంబాబు, జిల్లా పరిషత్తు ఉప చైర్మన్ ఎస్.గిరిబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ఆధ్వర్యంలో భారీ ఎత్తున వైసీపీ శ్రేణులు తరలివెళ్లాయి.

భారత్ - దక్షిణాఫ్రికా మ్యాచ్‌కు తరలివచ్చిన క్రీడాభిమానులు

విశాలాంధ్ర - పీయం పాలెం: మహిళల వన్డే ప్రపంచ కప్ మ్యాచ్‌కు విశాఖపట్నం వేదికగా మారింది. వర్షం కారణంగా ఆట ఆలస్యంగా ప్రారంభమైంది. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటలకు టాస్ వేయాల్సి ఉంది. 3 గంటలకు ఆట ప్రారంభం కావాల్సింది. వర్షం తగ్గినప్పటికీ మైదానాన్ని సిద్ధం చేసేందుకు సమయం పట్టింది.

మధ్యాహ్నం 3.30 గంటలకు టాస్ వేశారు. దక్షిణాఫ్రికా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత భారత్ బ్యాటింగ్ చేయనుంది. సాయంత్రం 4 గంటలకు మ్యాచ్ ప్రారంభం అయింది. అయితే క్రికెట్ క్రీడాభిమానులు అధికంగానే తరలివచ్చారు. పోలీసులు అడుగడుగునా ట్రాఫిక్ ఆంక్షలు విధించినప్పటికీ క్రీడాభిమానాలు అసహనం వ్యక్తం చేసి మరి స్టేడియంలోకి చేరుకున్నారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ అధికంగానే స్తంభించిపోయింది. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు సరిగ్గా కానరాకపోవడంతో వాహనాల పార్కింగ్‌తోపాటు స్టేడియంలోకి చేరుకోవడానికి అధిక సమయం పట్టింది.

అడుగడుగునా ట్రాఫిక్... కానరాని పోలీసులు

శభాష్ రిచా.... వైజాగ్‌లో విజృంభణ

94 బంతులకు అవుట్... భారీ స్కోరు దిశగా భారత్.. ఐసీసీ మహిళల ప్రపంచకప్-2025లో భాగంగా వైజాగ్ వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న మ్యాచ్‌కు భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కి దిగిన భారత అమ్మాయిల జట్టు కేవలం 102 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. మంధాన, హర్మన్ ప్రీత్, ప్రతీక, దీప్తి శర్మ వంటి కీలక బ్యాటర్లు ఔట్ కావడంతో టీమిండియా స్కోర్ 150 మార్క్ దాటడం కష్టమే అని అంతా భావించారు. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన రిచా అద్భుతం చేసింది. తన వీరోచిత పోరాటంతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది.

వికెట్లు పడినప్పటికీ ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. కేవలం 77 బంతుల్లోనే 11 ఫోర్లు, 4 సిక్సులతో 94 పరుగులు చేసింది. ఓ దశలో సెంచరీ మార్క్ అందుకునేలా కన్పించిన రిచా ఆఖరి ఓవర్లో భారీ షాట్ కు ప్రయత్నించి వికెట్ ను కోల్పోయింది. ఆ తర్వాతి బంతికే క్రీజులోకి వచ్చిన శ్రీచరణి కూడా ఔటైంది. దీంతో భారత్ 49.5 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌటైంది. రిచా విధ్వంసకర ఇన్నింగ్స్ ఫలితంగా దక్షిణాఫ్రికా జట్టుకు నీళ్లు తాగించారు. భారత బ్యాటర్లలో ఘోష్తో పాటు ప్రతికా రావల్ (37), స్నేహ్ రాణా(33) రాణించారు. సౌతాఫ్రికా బౌలర్లలో క్లోయ్ ట్రయాన్ మూడు వికెట్లు పడగొట్టగా, మారిజాన్ కాప్, మల్బా, నాడిన్ డి క్లెర్క్ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు.

వీఎంఆర్డీఏ ఎంసీ విశ్వనాథన్ బదిలీ

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ బదిలీ అయ్యారు. ఆయన్ని సమాచార శాఖ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌ని పూర్తి అదనపు బాధ్యతలపై నియమించారు. విశ్వనాథన్ గత ఏడాది జూలై 23న వీఎంఆర్డీఏ ఎంసీగా బాధ్యతలు స్వీకరించారు. 13 నెలల పాటు ఆయన ఈ బాధ్యతలు నిర్వహించారు. ఆయన హయాంలో వీఎంఆర్డీఏ కార్యాలయం ముందు ఉన్న ది డెక్ భవన నిర్మాణం పూర్తి చేశారు. కైలాసగిరిపై గ్లాస్ గురించి నిర్మాణం పూర్తయింది. జిప్ లైనర్, స్కై సైక్లింగ్ పూర్తి చేశారు. అసంపూర్తిగా ఉన్న కళ్యాణ మండపాల నిర్మాణం పూర్తయింది. ఉద్యోగుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ పనిలో పరుగులు పెట్టించారు. తరచూ సమీక్షలు నిర్వహిస్తూ ప్రాజెక్టుల పురోగతి సాధించారు. ఇటీవల మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఎన్ఏడి ఫ్లైఓవర్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేశారు. ఆయన వేగాన్ని అందుకోలేక ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. ఎంఐజి ఇళ్ల స్థలాలు డ్రా పూర్తి చేశారు. మిగిలిన స్థలాలను వేలానికి పెట్టారు. విఎంఆర్డిఏ ఖాళీ స్థలాలను గుర్తించి వేలం నిర్వహించారు. దుకాణాల నుండి బకాయిలు వసూలు చేశారు. సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేశారు. కైలాసగిరిపై త్రిశూలం ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది. హెలికాప్టర్ మ్యూజియం పనులు పూర్తయ్యాయి.

జగన్ నర్సీపట్నం పర్యటనలో భాగంగా విశాఖకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖ కేజీహెచ్‌కు చేరుకున్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పిల్లలను పరామర్శించారు. పిల్లల ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

(విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం)

ఎస్.హెచ్.జి మహిళల ఆరోగ్య రక్షణకు 'సఖి సురక్ష'

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగంగా పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘ (ఎస్.హెచ్.జి) మహిళల ఆరోగ్యం, సామాజిక ఆర్థిక శ్రేయస్సును మెరుగుపరచడానికి మెప్మా ఆధ్వర్యంలో "సఖి సురక్ష" అనే కార్యక్రమాన్ని మహిళల ఆరోగ్యానికి సురక్ష కవచంగా రూపొందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మెప్మా ఆధ్వర్యంలో జీవీఎంసీ యుసిడి విభాగం నిర్వహించిన "సఖి సురక్ష" కార్యక్రమాన్ని విశాఖ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్, యుసిడి ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎం సత్యవేణి, స్టేట్ మిషన్ మేనేజర్ ఎన్.ఎన్.శ్రీనివాస్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సరోజిని, డిఎం అండ్ హెచ్ఓ విభాగం డాక్టర్ లార్స్ లూసీ, ఈ వైద్య డాక్టర్లతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్‌జి మహిళలు నిరంతరం వారి విధి నిర్వహణలో నిమగ్నమై ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండటం లేదని భావించి వారి ఆరోగ్య రక్షణకు సురక్ష కవచంగా ఈ సఖి సురక్ష కార్యక్రమం మొట్టమొదటి సారిగా నేడు విశాఖలో ప్రారంభించడం జరిగిందన్నారు. 35 సంవత్సరాలు పైబడిన ఎస్‌హెచ్‌జి మహిళలు ఆరోగ్య పరీక్షలు తనిఖీ చేసుకోవచ్చని, ఈనెల 26 వరకు నగరంలో గాజువాక అనకాపల్లికి ఒక కేంద్రం, మధురవాడ, భీమిలికి ఒక కేంద్రం, పెందుర్తి, జ్ఞానాపురం ప్రాంతాలకు ఒక కేంద్రం మొత్తంగా కేంద్రాలలో ఆ ప్రాంత ప్రజలకు సఖి సురక్ష ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సరోజిని, జీవీఎంసీ యుసిడి, మెప్మా సిబ్బంది, 35 సంవత్సరాల నిండిన స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 58వ వార్డు ములగాడ గ్రామంలో గల టిట్కో ఇళ్లను గురువారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గణబాబు సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఇల్లు సముదాయాల్లో నిర్మాణాలను పరిశీలించి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ టీడీపీ అధ్యక్షులు కోరాడ శ్రీనివాసురావ, ఏఎంసి డైరెక్టర్, స్థానిక టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతబత్తుల శ్రీను, టీడీపీ సీనియర్ నాయకులు శీరపు నరసింగరావు, బూత్ కన్వీనర్ శీరపు నాగేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జి రాజేష్ రెడ్డి, గురుబిల్లి వెంకట రెడ్డి, బొడ్డపాటి రాజు, మహిళా నాయుకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కరించండి
ఎమ్మెల్యే కొణతాలకు వినతి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొనతాల రామకృష్ణకి గురువారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికులపై ఆర్థిక భారాలు అధికం అయ్యాయని, డీజిల్ పెట్రోల్ ధరలు తగ్గించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ (ఏఐటీయూసీ) యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, టాటా మ్యాజిక్ వ్యానుల ఓనర్ కం డ్రైవర్స్ జిల్లా అధ్యక్షులు యు.శివాజీ, వై.వెంకట్, భాస్కర్ దేముడు, అప్పలరాజులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీ-బిడ్డ ఆరోగ్యం: ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - ఆనందపురం: కడుపులో పెరుగుతున్న శిశువు ఆరోగ్యానికి ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాలు తీసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన 8వ రాష్ట్రీయ పోషక మాసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుట్టబోయే బిడ్డకు కావాల్సిన పోషకాలను శాస్త్రీయంగా ఎంపిక చేసి ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు జరిగే కార్యక్రమాన్ని గర్భిణీలు వినియోగించుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై సిబ్బంది ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కోట్లాది రూపాయల సంక్షేమ, అభివృద్ధి పనులకంటే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ఎక్కువ ఆనందం ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఎమ్మార్వో శ్రీనుబాబు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, కూటమి నేతలు చిక్కాల విజయ్ బాబు, బి.ఆర్.బి.నాయుడు, తమ్మిన అప్పలరాజు, శాఖారి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ రామస్వామి నాయుడు, రెడ్డి బాబు, కర్రి శ్రీనివాసరావు, కె.శ్రీకాంత్ రాజు, పిఏసిఎస్ చైర్మన్‌లు రౌతు నాగరాజు, గండ్రెడ్డి సోంబాబు, పాండ్రంకి అప్పలరాజు, బమ్మిడి ఉమ, మహంతి శివాజీ, అప్పలరాము, బమ్మిడి తారక్ తదితరులు పాల్గొన్నారు.

బయోడైజెస్టర్ నిర్వహణ శూన్యం

ఏళ్లతరబడి మూలన పడ్డ యంత్రం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రస్తుత దేవదాయ శాఖ (ఇన్‌చార్జ్ కమిషనర్) కె.రామచంద్ర మోహన్ రూ.లక్షలు వెచ్చించి క్రిష్ణాపురం గోశాలలో కంపోస్టు షెడ్ నిర్మాణం, కొండపైన నిత్యాన్నదాన భవనం ప్రక్కన విశాఖ స్టీల్‌ప్లాంట్ సౌజన్యంతో వర్మీ కంపోస్ట్ యంత్రం కొనుగోలు చేయటం జరిగింది. ఒకటో దశలో పర్యావరణం పచ్చదనం ఏర్పాటు చేసినా... రెండో దశలో తలపెట్టిన యాంత్రీకరణ నిలిచిపోవడంతో వ్యర్థాల నిర్వహణ దేవస్థానంకు భారామౌతోంది. 2018 ఫిబ్రవరి 13న నిత్యాన్న ప్రసాద భవనంకు సమీపంలో ఏర్పాటు చేసిన బయో డైజెస్టర్ ఇప్పుడు మూలకు చేరుకుంది. రాష్ట్రంలో ఇటువంటి శుద్ధమైన బయో డైజెస్టర్ ఏ దేవాలయంలో లేదు. బయోడైజెస్టర్‌లు ఉన్న వాటిలో కొన్ని రసాయనాలు కలుపుతున్నారని ఆరోజు ఈవోగా విధులు నిర్వహించిన రామచంద్రమోహన్ అన్నారు. నాటి నుండి ఎందరో ఈఓలు మారినప్పటికీ అటువైపు దృష్టిసారించకపోవటం బాధాకరమని కొంతమంది సిబ్బంది అంటున్నారు. సింహాచలం కొండపైన అన్నప్రసాద భవనం ప్రక్కన ఏర్పాటుచేసిన యంత్రంలో అన్నదానంలో మిగిలిన వ్యర్థాలు వేస్తే రోజుకు 250 కేజీల శుద్ధమైన ఎరువు ఉత్పత్తి జరుగుతుండేది. అలా వ్యర్థాల నుండి వచ్చిన ఎరువును పూల మొక్కలు, కృష్ణాపురం గోశాలలో ఉన్న కూరగాయలు మొదలగు వాటికి ఉపయోగించేవారు. భక్తులు, దాతలు నిధులతో నిర్మించిన ఈ యూనిట్ ప్రస్తుతం చడీ చప్పుడు లేకుండా ఉంది. ఇంత వరకూ బాగానే ఉన్నా... దాన్ని నిర్వహణలో వెనుకబడ్డారు. ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోతున్న చెత్తతో అనారోగ్యకర వాతావరణం నెలకొన్న దశలో... ఓ చక్కని పరిష్కారంగా 2018లో ఈ ఘన వ్యర్థాల నిర్వహణ యూనిట్‌కు రూపకల్పన చేశారు. చిన్న మధ్య తరగతి పట్టణాల మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకం క్రింద ప్లాంట్ యాజమాన్యం వారు ఈ నిధుల క్రింద ఈ యంత్రాన్ని దేవస్థానంకు విరాళంగా ఇవ్వటం ఇరిగింది. దేవస్థానం తన వంతుగా కొన్ని నిధులు సమకూర్చింది. దీనివల్ల తక్కువ సమయంలోనే అవసరమైన తడి చెత్తను సేకరించే అవకాశం ఉంది. కానీ ఇది ప్లాట్‌ఫాం మీద సంబంధిత ప్రదేశంలో నిరుపయోగంగా ఉంది. దాతలు ఇచ్చిన బయో డైజెస్ట్ వైపు ఎవరూ కన్నెత్తైనా చూడక పోవటం చాలా విచారకరమని నిత్యాన్నప్రసాదంకు వెళ్లే భక్తులు, స్థానికులు అంటున్నారు.

టాటా క్యాపిటల్ లిమిటెడ్
TATA
రిజిస్టర్డు ఆఫీసు: టవర్-ఎ, 11వ అంతస్తు, పెనిసుల బిజినెస్ పార్క్, గణపతిరావు కదం మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి-400013, ఇండియా.
CIN No. U65990MH1991 PLC060670

అనుబంధం-4
(నిబంధన-8(6) చూడుము)
స్థిర ఆస్తుల అమ్మకం కొరకు విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8(6)తో చదివే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ది ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిర ఆస్తుల విక్రయానికి ఇ-వేలం విక్రయ నోటీసు.
1.ఎం/ఎస్. ఆదిత్య స్టీల్ రోలింగ్ మిల్ ప్రైవేట్ లిమిటెడ్ ("రుణగ్రహీత/ తనఖాదారు") 2. శ్రీమతి మంజు దేవి ఖేమ్కా ("హామీదారు") 3. శ్రీ సురేష్ కుమార్ ఖేమ్కా ("హామీదారు") 4. శ్రీ ప్రదీప్ కుమార్ ఖేమ్కా ("హామీదారు") 5. శ్రీ అభిమన్యు ఖేమ్కా ("హామీదారు") నుండి వర్తించబడు వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో 08 ఆగష్టు, 2025 నాటికి రూ.12,53,87,182.62/- (పన్నెండు కోట్ల యాభై మూడు లక్షల ఎనభైఏడువేల నూట ఎనభైరెండు రూపాయల అరవై రెండు పైసలు మాత్రమే)లను తిరిగి రాబట్టుకునేందుకు ఈ దిగువ పేర్కొన్నట్లుగా టాటా కేపిటల్ లిమిటెడ్ (టీసీఎల్) (ఎస్‌సీఎల్‌టీ ద్వారా ఏర్పాటు చేసిన స్కీమ్‌కు అనుగుణంగా టాటా క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ వార్సుదారు మరియు ఆమోదించబడినవారు)కు తనఖా పెట్టిన/ఆధీనం చేయబడిన స్థిర ఆస్తిని టాటా కేపిటల్ లిమిటెడ్ (టీసీఎల్) అధీకృత అధికారి 22 ఏప్రిల్, 2025న భౌతికంగా స్వాధీనంలోకి తీసుకోవడమైనది. ఈ ఆస్తిని 'ఎక్కడ ఉన్నది ఉన్నట్లు' & "ఏది ఉంటే అది" మరియు "ఎక్కడ ఉన్నది ఏదైనా" ప్రాతిపదికపై **28 అక్టోబరు, 2025**న విక్రయించబడునని ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి రుణగ్రహీత (లు) మరియు హామీదారు(లు)లకు తెలియజేయడమైనది.
రిజర్వ్ ధర రూ. **1,13,40,000/-** (ఒక కోటి పదమూడు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే) మరియు ధరావత్తు సొమ్ము డిపాజిట్ (ఈఎండీ) రూ. 11,34,000/- (పదకొండు లక్షల ముప్పై నాలుగు వేల రూపాయలు మాత్రమే).
అమ్మకానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి టాటా క్యాపిటల్ లిమిటెడ్ (టీసీఎల్) వెబ్‌సైట్‌లో అంటే www.tatacapital.com లో అందించిన లింకును చూడండి: http://bit.ly/47fxdQN నిబంధనలలోని నియమం 9(1) తో చదివే సర్ఫేసీ చట్టం, 2002 నిబంధనల ప్రకారం రుణగ్రహీత/హామీదారు(లు)/తనఖాదారునికి పైన పేర్కొన్న తేదీన అమ్మకం నిర్వహించడం గురించి తెలియజేస్తూ ఇది 15 రోజుల తప్పనిసరి నోటీసు కూడా.

షెడ్యూల్
ఎం/ఎస్. ఆదిత్య స్టీల్ రోలింగ్ మిల్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తనఖా పెట్టిన సెక్యూర్డ్ ఆస్తి వివరణ

సర్వే/డోర్ పట్టా/ఖాతా నం.	వాల్తేర్ వార్డ్ యొక్క టి.ఎస్. నం. 1035, డోర్ నెం.9-1-252 అసెస్‌మెంట్ నెం. 39826 మరియు డోర్ నెం.9-1-252/3, అసెస్‌మెంట్ నెం.40671
ప్లాట్ నెం....../ఫ్లాట్ నెం.	ప్లాట్ నెం.17పై 'బాలాజీ టవర్స్' లోని రెండవ అంతస్తులో ఫ్లాట్ నెం. 302
కొలత/ఆస్తి విస్తీర్ణము	1750 చదరపు అడుగులు. సెల్లార్ ఫ్లోర్‌లో 100 చ॥అ॥ల ఒక కారు పార్కింగ్‌తో 40 చదరపు గజాల అవిభాజ్య భూమి యొక్క అవిభాజ్య భూమి వాటా
ప్రదేశము/ భూమి గుర్తులు/ ప్రాంతం పేరు, మొహల్లా (అవసరమైతే ఆ ప్రదేశానికి చేరుకోవడానికి ఆస్తి యొక్క స్పష్టమైన స్థానాన్ని ఇది ఇవ్వాలి)	గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వాల్తేరు వార్డులో ఉన్నది
నగరం/జిల్లా	
సరిహద్దులు:	
తూర్పు:	స్టెయిర్‌కేస్ & మెట్లు
పడమర:	ఓపెన్ టు స్కై
దక్షిణం:	ఓపెన్ టు స్కై
ఉత్తరం:	ఓపెన్ టు స్కై

తేదీ : 10-10-2025
ప్రదేశము: ముంబై
టాటా కేపిటల్ లిమిటెడ్ తరఫున
సం/-
అధీకృత అధికారి

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ ఎస్‌జీఎఫ్ పోటీలకు ఆనందపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.కామేశ్వరరావు తెలియజేశారు. పదో తరగతి విద్యార్థులు డి.సాయి తేజ, డి.దీక్షిత జిల్లా సాఫ్ట్ బాల్ జట్టుకి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.నరసింహమూర్తి, వి.బుజ్జి, వైఎఆర్‌కె ప్రసాద్‌లను ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సుస్థిరవేట విధానాలపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సిఎంఎఫ్ఆర్ఐ విశాఖపట్నం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సాంప్రదాయ మత్స్యకారులతో సంప్రదింపుల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ సంప్రదాయ మత్స్యకారుల అవసరాలు, వేట విధానాలు, మత్స్య సంపద నాణ్యత, మార్కెటింగ్, సుస్థిర వేట విధానాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగించుకొని సీ వీడ్ పెంపకం, కేజ్ పెంపక విధానాల ద్వారా ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని తీర జిల్లాల నుండి మత్స్యకారులు, డా. జో కిజకుడన్ ప్రధాన శాస్త్రవేత్త, సిఎంఎఫ్ఆర్ఐ వి.లక్ష్మణ రావు జె డి ఫిషరీస్, డా.మధుసూదన రావు, ప్రధాన శాస్త్రవేత్త,, షిఫ్ట్ డా.మీనా నిఫ్ఫాట్,ఎస్బిఐ ప్రసాద్, మహంతి, డీడీ ఎంపెడా, అర్జిల్లి .దాస్ ,హనుమంత రావు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. మత్స్యకారులను నీలి యోధులుగా గుర్తించి జిల్లా కలెక్టర్ సన్మానించారు.

లయన్స్ కేన్సర్, జనరల్ హాస్పటల్‌లో జీఎస్టీపై అవగాహన

విశాలాంధ్ర - విశాఖపట్నం: నగరంలోని లయన్స్ కేన్సర్, జనరల్ హాస్పటల్‌లో గురువారం జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎస్టీ 2.0 సంస్కరణలు, ప్రజా ఆరోగ్యం విషయంలో భారతప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయం అని ఆ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమా మహేశ్వరరావు అన్నారు. దీనివల్ల వైద్య సేవలు పేదలకు మరింత అందుబాటులో ఉంటాయని చెప్పారు. జీవిత/ఆరోగ్య బీమా సేవలు గతంలో 18 శాతం నుంచి ఇప్పుడు సున్నాకి, 36 రకాల ప్రాణ రక్షక, క్యాన్సర్, అరుదైన మందులపై పన్నులు ఇప్పుడు సున్నా శాతం, వివిధ రకాల మందులపై ఇప్పుడు 5 శాతం జీఎస్టీ మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. దీని వలన ప్రజల ఆరోగ్య సంరక్షణకు చాలా మేలు అని, వైద్య ఖర్చులలో భారీగా ఆదా అవుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ మోహన పాత్రో, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కల్యాణ్ ప్రసాద్, ఎన్టీఆర్ వైద్య మిత్ర వాసుదేవ రావు, సచివాలయం అడ్మిన్ దివాకర్ బాబు, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది మరియు రోగులు పాల్గొన్నారు.

మెంటల్ హెల్త్ డే ఎవర్నెస్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం గ్రామంలో మ్యాజిక్ బస్ ట్రెనింగ్ కం మానిటరింగ్ ఆఫీసర్ దూడ రమేష్ ఆధ్వర్యంలో మెంటల్ హెల్త్ డే ఎవర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ప్రతి ఒక్కరు కూడా మానసిక ఒత్తిడి లేకుండా ఉదయం లేవగానే వ్యాయామం చేయాలని తెలిపారు. అదే విధంగా ప్రేమానందం మాట్లాడుతూ పిల్లలు మొబైల్స్ ఫోన్స్ ఎక్కువగా వాడకూడదని, సోషల్ మీడియాకి గేమ్స్‌కి అడిక్ట్ అవ్వకుండా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సౌందర్య, పైలట్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ శంకర్రావు, టీం కోఆర్డినేటర్ భవాని, ఎంపీటీసీ రెడ్డి బాబు, జై జవాన్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, స్కూల్ ప్రధానోపాధ్యాయులు కామేశ్వరావు, ప్రేమానందం, నాయుడు, ప్రసాద్, బుజ్జి, మ్యాజిక్ బస్సు సభ్యులు రమణమ్మ, సాయి కుమారి, శారదా, దుర్గ పాల్గొన్నారు.

17న 6వ జోన్‌లో బహిరంగ వేలం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 6వ జోన్ (గాజువాక) పరిధిలోని పలు రోడ్డు మార్జిన్ మార్కెట్లు, వారపు సంతలలో వ్యాపారాలకు అక్టోబర్ 17న ఉదయం 11 గంటలకు బహిరంగబలం నిర్వహించబడునని 6వ జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్ శేషాద్రి గురువారం తెలియజేశారు. గాజువాక 6వ జోన్ పరిధిలో వార్డు నెం.64 నుండి 79, 85 నుండి 88 వరకు (స్టీల్ ప్లాంట్ వార్డు మినహాయించి) వార్డులలో గల రోడ్ మార్జిన్ మార్కెట్, ఓపెన్ స్టాల్స్ సుధా హొటల్ వెనుక, ఓపెన్ స్టాల్స్ పెదగంట్యాడ మరియు ఓపెన్ స్టాల్స్ ఈ-సేవ ప్రక్కన వడ్లపూడి మార్కెట్ నందు రోజు వారి వారపు సంతల్లో రోడ్డు మార్జిన్ నందు వ్యాపారం చేయు వర్తకదారుల నుండి రోజు వారి అశీలు వసూలుకు గుత్త ఇచ్చుటకు గాను తేది: 17-10-2025న జీవీఎంసీ జోన్-6 గాజువాక కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించబడుతుందన్నారు.

ప్రాజెక్టుల భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లా పరిధిలో చేపట్టనున్న విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు, రైల్వే లైన్ల విస్తరణ, ఇతర పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ, ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమీక్షా సమావేశంలో మెట్రో రైల్, సాధారణ రైల్వే లైన్ విస్తరణ, ఇతర అవసరాలకు కోసం చేపట్టాల్సిన భూసేకరణ సంబంధిత పనులు, ఇతర అంశాలపై ప్రస్తుత పరిస్థితిని అధికారులు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన అన్ని రకాల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశిం చారు. అభివృద్ధి ప్రాజెక్టుల పనులకు ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బి.హెచ్.భవానీ శంకర్, విశాఖ, భీమిలి ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాథుర్, ప్రత్యేక ఉప కలెక్టర్ సుధాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పంట భూములును గూగుల్‌కు కేటాయించడం తగదు: సిపిఎం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలోని దళిత రైతుల పచ్చని పంట భూములను గూగుల్ డేటా సెంటర్ కోసం కేటాయించడం తగదని సిపిఎం విశాఖపట్నం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు అభిప్రాయపడ్డారు. గురువారం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు, భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి తదితరులు తర్లువాడ గ్రామంలోని దళిత రైతులతో కలిసి గూగుల్‌కు కేటాయించిన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గు నాయుడు మాట్లాడుతూ 1971లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ కాలంలో తర్లువాడ గ్రామంలోని దళిత రైతులకు ఒక్కొక్కరికి రెండు ఎకరాల చొప్పున బి-పట్టాలు మంజూరు చేశారని, అప్పటి నుంచి రైతులు ఆ భూములపై జీడి మామిడితోపాటు అంతర పంటలైన బీర, వంగ, బెండ, బొప్పాయి, పూలు, ఆకుకూరలు, కాయగూరలు మొదలగు పంటలు పండిస్తూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ఇలాంటి పచ్చని పంట పొలాలపై కంపెనీలు కన్నేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 480 ఎకరాల భూములను గూగుల్, సిఫి, రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వంటి కంపెనీలకు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. వీటిలో తర్లువాడలో 200 ఎకరాలు, అచ్యుతాపురం, రాంబిల్లి ప్రాంతాల్లో 160 ఎకరాలు, అడవివరంలో 120 ఎకరాలు ఉన్నాయని వివరించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ గూగుల్ వంటి డేటా సెంటర్లు భారీగా నీటిని వినియోగిస్తాయని, ఇది స్థానిక పర్యావరణానికి, భూగర్భ జలాలకు తీవ్ర ముప్పు అని అన్నారు. రైతులకు తెలియకుండా భూసార పరీక్షలు, సర్వేలు, నష్టపరిహారం నిర్ణయాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ తర్లువాడ రైతులు జీడి, మామిడి, అరటి, బీర, ఆకుకూరలు, కూరగాయలు సాగు చేసి జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. సిపిఎం దళిత రైతుల పక్షాన నిలబడి, అవసరమైతే మండల, జిల్లా స్థాయిలో ఆందోళనలు చేపడతామని ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు 50 మంది రైతుల పంట పొలాలను సందర్శించి జీడి, బొప్పాయి, బెండకాయ, కనకంబర పంటలను పరిశీలించారు.

అమెజాన్ పే, కియర్నీ హౌ అర్బన్ ఇండియా పేస్ 2025 అధ్యయనం

విశాలాంధ్ర - విశాఖపట్నం: అమేజాన్ పే సహకారంతో కియర్నీ ఇండియా విడుదల చేసిన "హౌ అర్బన్ ఇండియా పేస్ 2025" నివేదిక ప్రకారం ఎఫ్‌వై 25లో పట్టణ భారతదేశంలో డిజిటల్ చెల్లింపుల పరిమాణాలు 35 శాతంకి పెరిగాయి. మహిళలు, యువ నిపుణులు మరియు చిన్న-పట్టణాల వినియోగదారులు డిజిటల్ గా చెల్లించడానికి కొత్త మార్గాలను అనుసరించడం దీనికి దారితీసింది. ఎలక్ట్రానిక్స్ మరియు దుస్తులు వంటి అధిక విలువ గల కొనుగోళ్లకు మాత్రమే కాకుండా యుటిలిటి బిల్లులు (2025లో 87 శాతం) వంటి పునరావృత వర్గాలకు కూడా డిజిటల్ పద్ధతులు ప్రాధాన్యత ఇవ్వడంతో, 2030 నాటికి భారతదేశం 7 ట్రిలియన్స్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ దిశగా తరలుతున్నప్పుడు చెల్లింపుల పరిస్థితిని పునర్నిర్మించడంలో, అభిలాషించే వినియోగదారులు వ్యయాల శ్రేణుల్లో డిజిటల్ లావాదేవీలను ఏ విధంగా విస్తృతం చేస్తున్నారో ఈ నివేదిక తెలియచేస్తోంది. మహిళలు, జెన్ జెడ్ మిల్లీనియల్స్ మార్పును ప్రోత్సహిస్తున్నారు. ఈ పరివర్తనకు మహిళలు శక్తివంతమైన ప్రేరణదారులుగా తలెత్తుతున్నారు. ఆన్ లైన్ కొనుగోళ్ల కోసం 89 శాతం మంది డిజిటల్ మోడ్స్ కు ప్రాధాన్యత ఇవ్వడంతో, గతంలో నగదుపై ఆధారపడటం నుండి ఇది మార్పుకు దోహదపడింది. ఈ ధోరణి మహిళా ఔత్సాహికులకు విస్తరించింది.

వీరిలో 80 శాతం మంది తమ వ్యాపారాలను డిజిటల్ గా నిర్వహిస్తున్నారు. దీనిలో యూ పీ ఐ (34 శాతం) ప్రథమ స్థానంలో ఉండగా, తదుపరి కార్డ్స్ (20 శాతం) మరియు వాలెట్స్ (8 శాతం)గా ఉన్నాయి. సంపన్న మహిళలు కూడా క్రెడిట్ ఆధారిత లావాదేవీల పట్ల ఎంతో ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. రివార్డ్స్ మరియు ఆర్థిక సౌలభ్యతతో ప్రేరేపించబడి 69 శాతం మంది క్రెడిట్ కార్డ్స్ కు ప్రాధాన్యతనిచ్చారు. మధ్య తరగతి ఆదాయం గల వర్గాలు తమ రోజూవారీ ఖర్చుల కోసం యూపీఐ, వాలెట్స్‌కి అనుకూలంగా కొనసాగాయని షష్వత్ శర్మ, పార్ట్‌నర్ మరియు ఫైనాన్షియల్ సర్వీసెస్ లీడ్, కియర్నీ ఇండియా అన్నారు.

యూపీఐ సర్కిల్‌ను ప్రారంభించిన అమేజాన్ పే

విశాలాంధ్ర - విశాఖపట్నం: గ్లోబల్ ఫిన్ టెక్ ఫెస్టివల్ 2025లో వివిధ ఆవిష్కరణలను అమేజాన్ పే ఈరోజు ప్రకటించింది.కుటుంబంలో ఎవరైనా తక్షణమే యూపీఐ చెల్లింపులను చేయడానికి, బయోమెట్రిక్ ప్రమాణీకరణ, నమ్మకమైన స్మార్ట్ డివైజ్ లకు యూపీఐ చెల్లింపుల విస్తరణ చేయడానికి యూపీఐ సర్కిల్‌ను విస్తరించింది. ఖర్చు చేసే పరిమితులను ముందుగా సెట్ చేయడం ద్వారా యూపీఐతో తక్షణమే చెల్లించడానికి యూపీఐ సర్కిల్ ఇప్పుడు ప్రాథమిక యూపీఐ ఖాతాదారులు సురక్షితంగా కుటుంబ సభ్యులను మరియు నమ్మకమైన పరిచయస్థులను చేర్చడానికి వీలు కల్పించింది. చేర్చబడిన ప్రతి సభ్యునికి తమ సొంత యూపీఐ ఐడి లేదా క్యూఆర్ కోడ్ కలిగి ఉంటారు కానీ బ్యాంక్ అకౌంట్లు ఆపరేట్ చేయవలసిన అవసరం లేదు కానీ ప్రాథమిక ఖాతాదారులు ఆమోదించిన నిర్ణయించబడిన నిధుల మొత్తాన్ని పొందగలరు. అన్ని చెల్లింపులు పిన్ లేకుండా చెల్లించవచ్చు మరియు భద్రత కోసం అదనపు బయోమెట్రిక్ ప్రమాణీకరణతో ప్రారంభించబడతాయి. చెల్లింపుల అభ్యర్థనలను సమీక్షించడం, ఖర్చు పరిమితిని ఏర్పాటు చేయడం, ఖర్చులను పర్యవేక్షించడం మరియు వివరణాత్మకమైన చెల్లింపు రికార్డ్స్ ను పొందడం సహా వినియోగంపై ప్రాథమిక యూజర్ పూర్తి నియంత్రణను కలిగి ఉంటారు. ఎన్పీసీఐతో వ్యూహాత్మకంగా చేసిన సహకారంలో, అమేజాన్ పే చెల్లింపు వ్యవస్థని స్మార్ట్ ఫోన్లకు మించి నమ్మకమైన స్మార్ట్ డివైజ్‌లకు కూడా విస్తరిస్తోంది. ఈ కార్యక్రమం స్మార్ట్ వాచీలు, ఇతర వేరబుల్స్‌కు సురక్షితమైన చెల్లింపు సామర్థ్యాలను తెచ్చింది, ఆధునిక బయోమెట్రిక్ ప్రమాణీకరణ, డివైజ్ స్థాయి ఎన్ క్రిప్షన్, మరియు వాస్తవిక సమయంలో మోసం గుర్తించడం వంటి ఫీచర్లను కలిగి ఉంది.

వృద్ధుల కోసం ఎల్వీపీఈఐలో ప్రత్యేక నేత్ర సంరక్షణ కార్యక్రమాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో వయో వృద్ధుల నేత్ర సంరక్షణలో భాగంగా అత్యాధునిక నేత్ర వైద్య సేవలు అందిస్తున్నట్లు వృద్ధుల నేత్ర సంరక్షణ విభాగాధిపతి డాక్టర్ అవినాష్ పతేంగే తెలిపారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సం పురస్కరించుకుని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ప్రాంగణంలో ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ అవగాహన కార్యక్రమాల ముగింపు సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల జీఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్‌తోపాటు తమ ఎల్వీపీఈఐ ఇతర క్యాంపస్లలో కూడా ఎల్డర్లీ ఐ కేర్ సెంటర్స్ (ప్రత్యేక వృద్ధుల నేత్ర సంరక్షా కేంద్రాలు) అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఏడాది జనవరిలో ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఆప్తాల్మిక్ నర్సింగ్ అసిస్టెంట్లు ద్వారా ఐసీఓపీఈ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభించిందన్నారు. సరళమైన నిర్మాణాత్మక పరికరాలను వినియోగించి ఆప్తాల్మిక్ నర్సింగ్ అసిస్టెంట్లు (ఓ ఎన్ ఏ లు) వృద్ధాప్యంలో కలిగే జ్ఞాపక శక్తి లోపాలు, పోషకాహార లోపం, వినికిడి లోపం, దృష్టి లోపం, నిరాశ వంటి ముందస్తు సమస్యలను గుర్తించి సకాలంలో సరైన చికిత్సను సూచించటం జరుగుతుందని చెప్పారు. ఈ కేంద్రాలలో ఫాల్ ప్రివెన్షన్ ఎక్స్ పీరియన్స్ సెంటర్ లను ఏర్పాటు చేసి, సాధారణంగా స్నానాల గది, మెట్ల పైన జారి పడటం వలన సంభవించు గాయాలు గురించి తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల అవగాహన కలిగిస్తుందన్నారు.

శనివారం జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2025 పార్ట్-1

విశాలాంధ్ర - విశాఖపట్నం: నిరంతరం ప్రేక్షకులకు వినోదం అందిస్తూ రెండు దశాబ్దాలుగా విజయవంతంగా కొనసాగుతున్న ఛానల్ జీ తెలుగు అని, అచంచలమైన అంకితభావంతో అలరిస్తూ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టడంలో జీ తెలుగు ఎదుగుదల కొనసాగుతూనే ఉందని ఆ ఛానల్ ప్రతినిధి చెప్పారు. జీ తెలుగు ఉన్నతికి కృషి చేస్తున్న ప్రతిభావంతులైన నటీనటులు, కళాకారులు, దర్శకులు, రచయితలు, నిర్మాతలకు ప్రతి సంవత్సరం ప్రతిష్ఠాత్మక జీ తెలుగు కుటుంబం అవార్డులను ప్రదానం చేస్తూ అదే ఉత్సాహంతో ముందుకు సాగాలని ప్రోత్సహిస్తుందన్నారు. ప్రతి ఏటా ఘనంగా జరిగే జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ వేడుక ఈ సంవత్సరం 'వసుధైవ కుటుంబం' నేపథ్యంతో మరింత వైభవంగా జరుగనుందన్నారు. జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2025 పార్ట్-1, రెడ్ కార్పెట్ పై బుల్లితెర తారలు, వెండితెర ప్రముఖుల సందడి అక్టోబర్ 10, శుక్రవారం సాయంత్రం 5 గంటలకు, ప్రతిష్ఠాత్మక జీ తెలుగు కుటుంబం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం మొదటి భాగం అక్టోబర్ 11, శనివారం సాయంత్రం 5 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారం అవుతుందన్నారు. అక్టోబర్ 10, శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ప్రసారం కానున్న రెడ్ కార్పెట్ కార్యక్రమంలో అందంగా ముస్తాబైన టాలీవుడ్ తారలు, ప్రముఖులు, బుల్లితెర నటీనటులు, ప్రత్యేక అతిథులు సందడి చేయనున్నారని చెప్పారు.

పబ్లిక్ హియరింగ్ రద్దు చేయాల్సిందే..

విశాలాంధ్ర - విశాఖ సిటీ: పెదగంట్యాడలో అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు మరల పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని, అదాని సిమెంట్‌కు అనుమతులు రద్దు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కే.లోకనాథం డిమాండ్ చేశారు. సిపిఎం విశాఖ జిల్లా కమిటీ జగదాంబ వద్ద గల సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్మీట్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఈనెల 8న పెద గంట్యాడ లో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్ ను

ప్రజలు స్వచ్ఛందంగా తిరస్కరించారని, సిమెంట్ కంపెనీ వద్దు ,గో బ్యాక్ అదాని, అంటూ తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేశారన్నారు. ప్రజాభీష్టాన్ని గుర్తించి ప్రభుత్వం అదాని సిమెంట్‌కు అనుమతులు అన్ని అనుమతులు రద్దు చేయాలని, దీనికి భిన్నంగా మరల 15 రోజుల తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని ప్రభుత్వం ప్రకటించడం ప్రజలను మోసం చేయడమేనని, ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా కార్యదర్శి ఎం .జగ్గు నాయుడు మాట్లాడుతూ అదాని అంబుజా సిమెంట్ ఏర్పాటుకు జరిగిన పబ్లిక్ హియరింగ్‌కు ప్రభుత్వం వందలాదిమంది పోలీసులను అధికారులను నియమించిందని, కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించిందని, ఈ కార్యక్రమంపై ప్రజలు తిరుగుబాటు చేసారన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజాభిప్రాయాన్ని గౌరవించి వెంటనే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, వి.క్రిష్ణరావు లు పాల్గొన్నారు.

యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి

విశాలాంధ్ర - ఆనందపురం: అవంతి విద్యాసంస్థల అధినేత మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సంపూర్ణ సహాయ సహకారాలతో అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాలికల యోగా జట్టు ఎంపిక మీట్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ మురళీ కృష్ణ జ్యోతి పాల్గొన్నారు. యోగా జట్టు ఎంపిక కార్యక్రమంలో విజయనగరం జవహార్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ పరిదిలో ఉన్న అన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన బాలికల యోగా జట్లు పాల్గొని యోగాసనాలు నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ యోగా అంటే వ్యాయామ సాధనల సమాహారాల ఆధ్యాత్మిక రూపం అని, ఇది హిందుత్వ ఆధ్యాత్మిక సాదనలలో ఒక భాగం అని, అంత మాత్రమే కాక మోక్ష సాధనలో భాగమైన ధ్యానం అతఃదృష్టి పరమానంద ప్రాప్తి లాంటి ఆధ్యాత్మిక పరమైన సాధనలకు ఇది ఒక పునాది అన్నారు. సాధారణంగా యోగాలో శారీరక ఆసనాలు, శ్వాస పద్ధతులు, మానసిక ఆధ్యాత్మికతను, శరీరం మనస్సు ఆత్మ ఐక్యత లాంటివి కీలకంగా ఉంటాయన్నారు. యోగా ట్రైల్ జట్టులలో అత్యంత ప్రతిభ కనపరచిన విద్యార్థినులు బి. భవ్యశ్రీ, కే.నందిని, ఆర్.భవిత, యం.శ్రీ వైష్ణవి, జె.తేజశ్రీ, యం.శ్రీహిత, సి.హెచ్ భువనేశ్వరి, పి.శృతి, బి.హర్షిణి, బెంగుళూర్‌లో స్వామి వివేకానంద యోగా కేంద్రం లో జరగబోయే ఇంటర్ యూనివర్సిటీ యోగా టోర్నీ లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.మరళీ, కృష్ణ,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డా.యు.రాము, రాజాం యోగా ఆశ్రమం శిక్షణాకులు కే.శ్రీనివాసరావు, విశాఖ వ్యాలీ స్కూల్ యోగా శిక్షణాకులు కే.వెంకట్ ఎంగాదర్,సమయ నిర్దేశికులు యం.కిరణ్ రాజు, సెలక్షన్ కమిటీ అధికారి రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా చంద్ర శేఖర్,ఆర్గనైజర్ గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రపై జగన్‌ది కపట ప్రేమ

- టిడిపి నాయకుడు చింతకాయల విజయ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జగన్ మోహన్ రెడ్డి ఉత్తరాంధ్రపై కపట ప్రేమ చూపిస్తున్నారని టిడిపి యువ నాయకుడు చింతకాయల విజయ్ అన్నారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021లో అనకాపల్లిలో మెడికల్ కాలేజీ అని చెప్పి, తరువాత నర్సీపట్నంలో పెడుతున్నాను అన్నారన్నారు. మెడికల్ కాలేజీ కోసం జగన్ కనీసం 11 కోట్లు కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. స్టీల్ ప్లాంట్ తీసేసి అక్కడ రాజధాని కడితే ఎలా ఉంటుందని ఎల్వీ ప్రసాద్ ను జగన్ అడిగారని, అలాంటి వ్యక్తి ఇప్పుడు స్టీల్ ప్లాంట్ పై ముసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఈ ఒక్క ఏడాదిలో నర్సీపట్నం మున్సిపాలిటీకి 23 కోట్లు ఖర్చు చేశారని తెలియజేసారు. పీపీపీ మోడ్ అంటే ఏంటో అర్థం కూడా జగన్ కు తెలియడం లేదన్నారు. మెడికల్ కాలేజీ ల గురించి మాట్లాడాలని ఉంటే జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలన్నారు. జగన్ ఏపీ నీ 5ఏళ్లు నష్టాల్లోకి నెట్టేశారని, చంద్రబాబు వలన ఏపీ ఎకానమీ పెరుగుతుందన్నారు. డబ్బులన్నీ అమరావతికే ఖర్చు చేస్తున్నారు అని ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. రెడ్ బుక్ వలన తప్పులు చేసిన వారంతా సస్పెండ్ అవడంతోపాటు జైలు కు వెళుతున్నారన్నారు. జగన్ కు దమ్ముంటే పులివెందుల వదిలి విశాఖ లో పోటీ చేయాలని సవాల్ చేశారు.